జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


శుక్రవారం | 22-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 679 పేజీలు: 4 వెల : రూ.7



# డ్రోన్ కెమెరాలతో.. నిఘా

* అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు * పట్టణ శివారు, నిర్మానుష్య, నదీతీర ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ * పేకాట, గంజాయి, మద్యం తాగే వారిపై కొరడా * నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు * జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం క్రైం, మే 21(వార్త):** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు శ్రీకాకుళం జిల్లా పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి రోజు జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని పాడుబడిన ఇళ్లు, నిర్మానుష్య ప్రదేశాలు,నదీ పరివాహక ప్రాంతాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నారు. అనుమానాస్పద ప్రదేశాల్లో వ్యక్తుల కదలికలను డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరించి, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కొరడా ఝులిపిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి అసాంఘిక మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు ఈ ప్రత్యేక నిఘా చేపడుతున్నారు. పాడుబడిన భవనాలు, ఖాళీ ఇళ్లు, తోటలు, నిర్మానుష్య ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల భద్రత, నేరాలు నియంత్రణకై జిల్లా పోలీసులు డ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా పెడుతున్నారని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలపై సమాచారాన్ని సమీపంలో గల పోలీసు స్టేషన్లలో గాని డయల్ 112 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారాన్ని అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.





# హెల్మెట్‌తో.. ప్రాణాలకు.. అభయం

* జిల్లాలో పెరుగుతున్న హెల్మెట్ వినియోగం
* ఫలిస్తున్న హెల్మెట్ బ్యాంకు లక్ష్యం
* హెల్మెట్ ధరించిన వాహనదారులను పోలీసుల అభినందన
















**శ్రీకాకుళం, మే 21(వార్త):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "అభయం హెల్మెట్ బ్యాంకు" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వినియోగంపై చైతన్యం పెరిగి, ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించడం తమ బాధ్యతగా భావిస్తూ అధిక సంఖ్యలో వాహనదారులు హెల్మెట్‌లను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం డే అండ్ నైట్ కూడలి ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ వద్ద ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న ద్విచక్ర వాహనదారులను అభినందించి, వారికి చాక్లెట్లు పంపిణీ చేసి ప్రోత్సహించారు. అదేవిధంగా హెల్మెట్ ధరించని వారిని గుర్తించి అభయం హెల్మెట్ బ్యాంకు ద్వారా హెల్మెట్లు అందజేశారు. అనంతరం ప్రయాణం సమయంలో వాహన దారులు హెల్మెట్ తప్పక ధరించాలని, ప్లకార్డులను ట్రాఫిక్ సిబ్బంది ప్రదర్శించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామారావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల సమయంలో తలకు సంభవించే తీవ్ర గాయాల నుంచి రక్షణ పొందేందుకు హెల్మెట్ అత్యంత కీలకమని పేర్కొన్నారు. వాహనం నడిపే ప్రతి వ్యక్తి తన భద్రతతో పాటు కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు దుర్గాప్రసాద్, శ్రీనివాస రావు, సోమశేఖర్, దొర, దాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపుపై దృష్టి సారించాలి

**జలుమూరు, మే 21 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ బమ్మిడి మాధవరావు సూచించారు. గురువారం జలుమూరు మండల కేంద్రంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక అడ్మిషన్ ప్రచార కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు రామారావు చేపట్టిన ప్రత్యేక అడ్మిషన్ క్యాంపెయిన్ ద్వారా ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే 26 మంది విద్యార్థులు పాఠశాలలో చేరినట్లు తెలుసుకుని ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి మరిన్ని చేరికలు సాధించాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు తన పరిధిలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని, విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేయాలని కోరారు.



## పురోగతిలో కిడిమి-మదనాపురం రోడ్డు పనులు



**సారవకోట, మే 21 (వార్త):** సారవకోట మండలంలోని కిడిమి-మదనాపురం రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల పొడవున చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఏప్రిల్ నెలలో ప్రారంభమైన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. రహదారి నిర్మాణం పూర్తయితే మదనాపురం, జరాలి, చంద్రయ్యపేట, రామకృష్ణపురం తదితర గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

ప్రస్తుతం గ్రామస్తులు రవాణా సౌకర్యాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం తగ్గడంతో పాటు అత్యవసర సేవలు కూడా సులభంగా చేరుకునే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇటువంటి మౌలిక సదుపాయాల పనులు ఎంతో దోహదపడతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఉద్దానం గ్రామాల్లో కిడ్నీ వ్యాధులపై పరిశోధన

**సోంపేట, మే 21(వార్త):** దశాబ్ద కాలం పైగా ఉద్దానం గ్రామాలను పట్టిపీడిస్తున్న కిడ్నీ వ్యాధుల భరతం పట్టేందుకు ప్రభుత్వం కృతనిచ్ఛయంతో కృషి చేస్తోంది. ఈ మేరకు కొద్దిరోజులుగా శ్రీకాకుళం కిడ్నీ రీసెర్చ్ ప్రాజెక్టు పేరుతో డాక్టర్ రవిరాజ్ నెఫ్రాలజిస్ట్ ఆధ్వర్యంలో ఆంధ్ర మెడికల్ కాలేజీ అధ్యాపక బృందం ఒకవైపు సర్వే నిర్వహించడం మరోవైపు గ్రామాల్లో వ్యక్తుల నుంచి వివరాలు రక్త నమోనాలు సేకరిస్తున్నారు. గురువారం ఉదయం కవిటి మండలం బల్ల ఎర్ర గోవింద పుట్టుగా గ్రామంలో స్థానిక ఆశా వర్కర్ సహకారంతో మెడికల్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్ గొట్టిపల్లి ప్రసాద్ ఇన్వెస్టిగేటర్ ఆధ్వర్యంలో టెక్నికల్ సపోర్ట్ సిబ్బంది ఐదుగురితో కూడిన బృందం ఏడు మండలాల్లో వేల సంఖ్యలో రక్త నమోనాలను వ్యక్తుల యొక్క ఆహారపు అలవాట్లను కుటుంబ నేపథ్యాన్ని అలాగే కుటుంబంలో గల వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరిస్తున్నారు. సేకరించిన రక్త నమూనాలతో విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్ లో వివిధ రకాలైన పరీక్షలు నిర్వహించి త్వరలోనే వాటి ఫలితాలు అందజేస్తామని సిబ్బంది పేర్కొన్నారు. ఇచ్ఛాపురం కవిటి,కంచిలి, సోంపేట, మందస, వజ్రపు కొత్తూరు తదితర మండలాల్లో సర్వే చేపట్టనున్నారు. రక్త నమూనాలు సేకరించిన వారి లివర్ ఫంక్షన్, రేనల్ ఫంక్షన్, సి బి సి, కొలెస్ట్రాల్, హెచ్బీఏ 1సి తదితర పరీక్షలు చేపడుతామని అన్నారు. అనంతరం రక్త పరీక్షలు రోగుల లక్షణాలు గ్రామాల్లో మంచినీటి వినియోగం మొదలైన అంశాలపై విశ్లేషణ జరిపి కిడ్నీ వ్యాధులకు మూలాలను కనుక్కొనేందుకు చేస్తున్న ప్రయత్నమని సిబ్బంది పేర్కొన్నారు.



## త్వరలో పైడిగం ప్రాజెక్టుకు మరమ్మతులు

### - బీసీ సంఘం అర్జీ పై స్పందించిన ఇరిగేషన్ శాఖ

**సోంపేట, మే 21(వార్త):** సోంపేట కంచిలి మండలాల వ్యవసాయానికి జీవనాడిగా పేర్కొనబడే పైడిగం ప్రాజెక్టు మరమ్మతుల పనులు త్వరలో ప్రారంభిస్తామని ఇరిగేషన్ శాఖ అధికారులు లిఖితపూర్వకంగా తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో బీన ఢిల్లీ రావు తదిత రైతులు ఈనెల 11న జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ కు హాజరై పైడిగం ప్రాజెక్టు ప్రధాన కాలువ మరమ్మతులు వెంటనే చేపట్టి వచ్చే ఖరీఫ్ నాటికి వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. సదరు అర్జీని కలెక్టర్ కార్యాలయం నుంచి ఇరిగేషన్ శాఖకు పంపించడం ద్వారా సంబంధిత అధికారులు పరిశీలన అనంతరం ఢిల్లీ రావుకు లిఖితపూర్వకంగా సమాచారాన్ని అందజేశారు. ప్రాజెక్టు మరమ్మతులకు 2025 ఏప్రిల్ లో సుమారు 38 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నివేదిక పంపించడం జరిగిందని ఇంతవరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదని పేర్కొన్నారు. అనంతరం పంపించిన షట్టర్లు సైపూన్ల మరమ్మతుల ఫైలుకు ఆమోదం లభించిందని త్వరలో సంబంధిత పనులు చేపడుతామని పేర్కొన్నారు.



### ప్రభుత్వ పరిశీలనలో పంట నష్టపరిహారం :

జింక్ భద్ర పలాసపురం బెంకిలి గ్రామాలలో ఏప్రిల్ లో కురిసిన వడగండ్ల వానకు వందలాది ఎకరాల్లో టమాటా పంట పూర్తిగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. దీనిపై రైతులకు నష్టపరిహారం కోరుతూ రాష్ట్ర బీసీ సంఘం గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేయగా సంబంధిత ఉద్యాన శాఖ అధికారులు టమాటా పంటకు నష్టం వాటిల్లడం వాస్తవమేనని సర్వే చేపట్టి నివేదికను ప్రభుత్వానికి అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు వివరాలను ఢిల్లీ రావు పత్రికలకు వివరించారు.

## వనిత మండలం వంతెనకు మళ్లీ ఊపిరి.. ప్రజల్లో ఆనందం




**పోలాకి, మే 21 (వార్త):** పోలాకి మండలంలోని వనిత మండలం వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన పనులకు మళ్లీ ఊపిరి లభించడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2018లో ప్రారంభమైన ఈ వంతెన నిర్మాణం నిధుల కొరత కారణంగా మధ్యలోనే నిలిచిపోయింది. తరువాత రూ.72 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించినప్పటికీ, వివిధ కారణాలతో అవి మళ్లీ నిలిచి పోయాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నరసన్నపేట పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వంతెన నిర్మాణ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం అదనంగా రూ.14 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు సమాచారం. ఈ నిధులతో త్వరలోనే వంతెన నిర్మాణ పనులు పునఃప్రారంభం కానుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వంతెన పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు.

## రోడ్లపైకి విస్తరిస్తున్న పిచ్చి మొక్కలు

### - తొలగించాలని కాలనీవాసుల విజ్ఞప్తి

**సారవకోట, మే 21 (వార్త):** సారవకోట మండల కేంద్రంలోని జాతీయ రహదారి (326A)ను ఆనుకుని ఉన్న అఫీషియల్ కాలనీలో పిచ్చి మొక్కలు విస్తరిస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల పక్కన పెరిగిన మొక్కలు క్రమంగా రహదారిపైకి విస్తరిస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందని కాలనీవాసులు చెబుతున్నారు. మొక్కలు మరింత పెరిగితే రహదారి వెడల్పు తగ్గి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఈ మొక్కలు నివాస గృహాల పునాదుల వరకు వ్యాపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుడు బి. త్రినాధ్ మాట్లాడుతూ పిచ్చి మొక్కలు ఇంటి పునాదుల్లోకి చొచ్చుకుపోవడం వల్ల గోడలకు బీటలు పడే అవకాశం ఉందన్నారు. సమస్య మరింత తీవ్రం కాకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ స్పందించి పిచ్చి మొక్కలను తొలగించి కాలనీలో పరిశుభ్రత, రహదారి భద్రతకు చర్యలు చేపట్టాలని కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## మహిళలకు చట్టాలపై అవగాహన

**పోలాకి, మే 21 (వార్త):** మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి డివిజన్-4కు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు ఎం. గిరిధర్, భీమారావు సూచించారు. గురువారం పోలాకి మండలం మునసబుపేట గ్రామంలోని చెరువు వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ వినియోగంపై వివరించారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించరాదని హెచ్చరించారు. అలాగే ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలను ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్, పోలీసు హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి మహిళ శక్తి యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండటం అవసరమన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూపీసీ ధనలక్ష్మి పాల్గొని మహిళలకు పలు సూచనలు అందించారు.



## ఎంఎల్‌ఏ శిరీషాను కలిసిన రైతు నాయకులు

### -సమస్యలు పరిష్కరించాలని వినతి

**మందస, మే 21(వార్త):** పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషను రైతాంగ సమస్యల సాధన కమిటీ కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతం పరిధిలో ఎక్కువ కుటుంబాలు జీడి పంటపై ఆధారపడి బతుకుతున్నారు. జీడి పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని అనేకసార్లు మీ దృష్టికి తేవడం జరిగిందని, మీరు కూడా దపాదఫాలుగా శాసనసభలో ప్రస్తావించారన్నారు. ఎన్నికల సందర్భంలో పలాస వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ, ఇంతవరకు ఎటువంటి ఫలితం లభించలేదన్నారు. చొరవ తీసుకొని జీడిపంటకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, సరైన గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

జీడిపంటకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, 80 కేజీల బస్తాకు రూ.18వేలకు కొనుగోలు చేయాలని, జీడి, కొబ్బరి బోర్డులను ఏర్పాటు చేయాలని, ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి, 300 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు, కార్యదర్శి గొర్లె చలపతిరావు, మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు, టెక్కలి డివిజన్ రైతాంగ కమిటీ మాజీ అధ్యక్షుడు దాసరి శ్రీరాములు, మద్దిల ధర్మారావు, బొడ్డు సింహాద్రి, పోతనపల్లి ఆనంద్, పోతనపల్లి త్రినాథ్, బొడ్డు పాపారావు, తామాడ రామారావు, హేమలయ్య, బత్తిని వాసుదేవు, డొక్కరి వీరాస్వామి, వంశధార జల సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మధ రావు తదితరులు పాల్గొన్నారు.



## బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ జోలికి వెళ్లొద్దు



**పలాస, మే 21 (వార్త):** జిఎంఈ కూడలి వద్ద పోలీసులు అవగాహన గర్జనతో ప్రజల్లో చైతన్యం నింపారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఎస్సై ఆర్. నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గ్రామాన్ని గురువారం రాత్రి సందర్శించారు. జంక్షన్ వద్ద ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎస్సై నరసింహమూర్తి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామస్తులకు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా నారీ శక్తి ప్రాముఖ్యత, మహిళల హక్కులు, కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తూ మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని ప్రోత్సహించారు. గ్రామ భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించిన పోలీసులు, దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో జరిగే పండుగలు, ఉత్సవాల సమాచారం ముందుగానే పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని కోరారు. నేటి సమాజాన్ని వేధిస్తున్న సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, గ్యాంబ్లింగ్, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా వంటి అంశాలపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్యవివాహాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు వంటి సున్నిత అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంచుతూ, అత్యవసర పరిస్థితుల్లో 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

ఈ అవగాహన కార్యక్రమం ద్వారా గ్రామంలో శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు ఇచ్చిన సూచనలకు గ్రామస్తులు సానుకూలంగా స్పందించి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జిఎంఈ కూడలి వద్ద పోలీసులు నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం గ్రామ ప్రజల్లో చైతన్యాన్ని నింపుతూ, నేరాలపై కఠిన సందేశాన్ని ఇచ్చింది.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 24న మందసలో విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక సమావేశం

**మందస, మే 21(వార్త):** విభిన్న ప్రతిభావంతుల హక్కుల జాతీయ వేదిక ద్వారా దివ్యాంగుల సమావేశం ఈ నెల 24న మందసలో నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ చెప్పారు. మందస మండలంలో ఈ నెల 24న ఆదివారం ఉదయం 9గంటలకు పెట్రోల్ బంకు రోడ్డు ప్రక్కన ఖాళీ స్థలంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. సంఘం సభ్యత్వ నమోదు చేయడం, రసీదులు ఇవ్వబడుతుందన్నారు. సభ్యత్వ రుసుము రూ.100లు చెల్లించాలన్నారు. పెన్సన్ తీసుకుంటున్న దివ్యాంగులకు రూ.6వేలు పించన్ వస్తుందని, కేంద్ర ప్రభుత్వం మూడు వందల రూపాయిలు ఇస్తోందని, ఆంధ్రప్రదేశ్ రూ.5.700లతో కలిపి మొత్తం ఆరువేల రూపాయిలు అందుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం మూడువేల రూపాయలు ఇవ్వాలని, దీంతో మొత్తం తొమ్మిది వేల రూపాయలు అవుతాయన్నారు. దివ్యాంగుల అప్లికేషన్ చేసి ఢిల్లీకి పంపడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు జిరాక్సు, దివ్యాంగుల సర్టిఫికేట్ జిరాక్సు(సదరన్ సర్టిఫికేట్ జిరాక్సు), ఒక పాస్ పోర్టు ఫోటో, ఆధార్ కార్డు జిరాక్సు పేపరు మీద ఫోన్ నెంబరు రాయలని, విద్యార్హతలు కూడా అందివ్వాలన్నారు. పూర్తిగా నడవలేని, బెడ్ రెస్టు ఉన్నవారు తదితరులు సమావేశానికి హాజరు కావలసిన అవసరం లేదన్నారు. వారి తరుపున కుటుంబ సభ్యులు రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440327293, 7661968142 అనే ఫోన్ నంబర్లుకు సంప్రదించాలని కోరారు.



# వనిత మండలం వంతెనకు రూ.14 కోట్ల అదనపు నిధులు

**- త్వరలో పునఃప్రారంభం కానున్న నిర్మాణ పనులు**

**- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**




**పోలాకి, మే 21 (వార్త):** పోలాకి మండలం వనిత మండలం వద్ద నిర్మాణంలో నిలిచిపోయిన వంతెన పనులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.14 కోట్ల నిధులను మంజూరు చేయడంతో నిర్మాణ పనులు త్వరలోనే తిరిగి ప్రారంభం కానున్నాయని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఈ నిర్ణయంతో పరిసర గ్రామాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. గురువారం పోలాకి మండలం కత్తిరివానిపేటలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, వంతెన నిర్మాణ పనులు 2018లో ప్రారంభమైనప్పటికీ నిధుల కొరత కారణంగా 64 శాతం పనులు పూర్తయ్యాక నిలిచిపోయాయని చెప్పారు. దీంతో ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థులు, రైతులు, ఉద్యోగుల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వం రూ.72 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులను పునఃప్రారంభించినప్పటికీ, అదనపు వ్యయభారం మరియు నిధుల లభ్యతలో జాప్యం కారణంగా మరోసారి పనులు నిలిచిపోయాయని వివరించారు. దీంతో వంతెన పూర్తి అవుతుందా అనే సందేహాలు స్థానిక ప్రజల్లో నెలకొన్నాయని అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నరసన్నపేట పర్యటన సందర్భంగా వంతెన నిర్మాణ అంశాన్ని తన దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వంతెన ప్రాధాన్యతను వివరించి అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అదనంగా రూ.14 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. ఈ నిధుల విడుదలతో నిర్మాణ పనులు వేగవంతమై త్వరితగతిన పూర్తయ్యే అవకాశముందని చెప్పారు. వంతెన అందుబాటులోకి వస్తే పరిసర గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభతరం అవుతుందని, వ్యాపార కార్యకలాపాలకు కూడా ఊతమిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిలో మినరల్ వాటర్ ప్లాంట్

**- పీసీఎంఏ సహకారంతో ఏర్పాటు**

**- ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీష**

**పలాస, మే 21 (వార్త):** పలాస కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం ప్రారంభించారు. పీసీఎంఏ (పిసిఎంఎ) సంఘం ప్రతినిధుల ఆర్థిక సహకారంతో ఈ స్వచ్ఛమైన తాగునీటి కేంద్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు నాణ్యమైన, స్వచ్ఛమైన తాగునీరు అందించడం ఎంతో అవసరమని, ఈ దిశగా పీసీఎంఏ సంఘం ముందుకు వచ్చి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సామాజిక బాధ్యతతో ఈ ప్రాజెక్టును చేపట్టినందుకు పీసీఎంఏ సభ్యులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పీసీఎంఏ సంఘం ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆస్పత్రి వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జీడి పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలి

**రైతాంగ సమస్యల సాధన కమిటీ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత**



**పలాస, మే 21 (వార్త):** జీడి పంటకి సరైన మద్దతు ధర ప్రకటించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఉద్దానం రైతాంగ సమస్యల సాధన కమిటీ వినతి పత్రాన్ని గురువారం పలాస ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఉద్దాన ప్రాంతం పరిధిలో ఎక్కువ కుటుంబాలు జీడి పంటపై ఆధారపడి బ్రతుకుతున్న విషయము మీకు తెలియని విషయం కాదని, జీడి పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని అనేకసార్లు మీ దృష్టికి తీసుకొచ్చామని, మీరు కూడా దబ దబాలుగా శాసనసభలో ప్రస్తావించి ఉన్నారు. ఎన్నికల సందర్భంలో పలాస వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఎటువంటి ఫలితం లభించలేదని, మీరు చొరవ తీసుకొని జీడిపంటకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సరైన గిట్టుబాటు ధర కల్పిస్తారని కోరుకుంటున్నామని చెప్పారు. జీడిపంటకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 80 కేజీల బస్తా 18000 /- రూ లకు కొనుగోలు చేయాలని, జీడి కొబ్బరి బోర్డులను ఏర్పాటు చేయాలని, ఎనర్జీఎస్ ని వ్యవసాయానికి అను సంధానం చేసి 300 రోజులు ని దినాలు కల్పించాలని డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని అందించారు.

ఈ కార్యక్రమంలో రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షులు మామిడి మాధవరావు, కార్యదర్శి గొర్ల చలపతిరావు, మహేంద్ర సంఘం అధ్యక్షులు బెస్త కామేశ్వరరావు, టెక్కలి డివిజన్ రైతాంగ కమిటీ మాజీ అధ్యక్షులు దాసరి శ్రీరాములు, మద్దిల ధర్మారావు, బొడ్డు సింహాద్రి, పోతనపల్లి ఆనంద, పోతనపల్లి త్రినాథ్, బొడ్డు పాపారావు, తామర రామారావు, ఎక్స్ ఆర్మీ హేమలయ్య, బత్తిని వాసుదేవు, డోక్కరి వీరాస్వామి, వంశధార జన సాధన కమిటీ అధ్యక్షులు మార్పు మన్మధ రావు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**శ్రీకాకుళం, మే 21 (వార్త):** భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కళాశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు నాయకత్వం వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తూ టెలికాం, ఐటీ, కంప్యూటర్ రంగాల అభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామీణాభివృద్ధికి పునాది వేశారని, 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతను ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములను చేశారని తెలిపారు. 1986 జాతీయ విద్యా విధానం, జవహర్ రోజ్‌గార్ యోజన, మహిళా సాధికారత వంటి పలు సంస్కరణలను అమలు చేసి దేశాభివృద్ధికి దోహదపడ్డారని అన్నారు. భారతదేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అన్ని రంగాల అభివృద్ధికి మార్గనిర్దేశం చేసిన దార్శనిక నాయకుడు రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్,



కరిమజ్జి మల్లేశ్వరరావు, డి. గోవింద మల్లిబాబు, కెవీఎల్ఎస్ ఈశ్వరి, ఆబోతుల వెంకటనాయుడు, మామిడి సత్యనారాయణ, లఖినేని నారాయణరావు, ఇజ్జురోతు రమణ, బస్వా షణ్ముఖరావు, కూరకుల వెంకటరావు, చాన్‌బాషా, బేరి వెంకట్రావు, జి. రామారావు, పిన్నింటి పరంనాయుడు, గొల్లపల్లి దాలయ్య, సనపల రాజులు, వేదాంతం తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



# రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

**- జీడి పిక్కలు 80కిలోలు రూ.18వేలకు ప్రభుత్వం కొనుగోలు చేయాలి**

**-సాగునీటి వనరులు బాగు చేయాలి**

**-వంశధార కాలువను ఇచ్ఛాపురం వరకు పొడిగించాలి**

**-పలాస డివిజన్ రైతాంగ సమస్యల సాధన కమిటీ**

**మందస, మే 21(వార్త):** రైతాంగ సమస్యలను పరిష్కరించాలని పలాస డివిజన్ రైతాంగ సమస్యల సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మందస మండలంలోని హరిపురం గ్రామంలో గల మార్పు గ్రంథాలయంలో పలాస డివిజన్ రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంత రైతాంగం ఎదుర్కొంటున్న జీడిపిక్కల మద్దతు ధర సమస్యపై సుదీర్ఘంగా చర్చించడం జరిగిందన్నారు. గత 40సంవత్సరాల నుండి సమస్యపై పలుమార్లు అధికారులకు, అధికారంలోకి వస్తున్న రాజకీయ పార్టీలకు, ప్రభుత్వానికి రైతాంగ తరపున వినతిపత్రాలను అందజేయడం జరిగిందన్నారు. కానీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం కూటమి ప్రభుత్వం నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖామంత్రి అచ్చెంనాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, నారా లోకేష్ పలాస వచ్చినప్పుడు వారంతా హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే జీడిపిక్కల సమస్యను పరిష్కరిస్తామని నేటికి రెండు సంవత్సరాలు కావస్తోందన్నారు. ఇంతవరకు పరిష్కారం కాలేదని, తక్షణమే 80కిలోల జీడి పిక్కల బస్తా రూ.18వేలకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొబ్బరి, జీడి బోర్డు ఏర్పాటు చేయడానికి చర్చించడం జరిగిందని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని హార్టికల్చర్ విభాగంలో వ్యవసాయ రంగానికి అనుసంధానిస్తూ 300 పని దినాలు కల్పించాలని, ఆధునికమైన అంటు మొక్కలు, అధిక దిగుబడినిచ్చే మొక్కలను పంపిణీ చేయాలని, రైతులకు నేరుగా పనిముట్లను ఉచితంగా అందించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామ యూనిట్ గా రైతులకి అందివ్వాలన్నారు. రైతులకు జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకటించి, రైతులకు సబ్సిడీ రుణాలు అందించాలని, వాతావరణ పరిస్థితులు, విపత్తుల కారణంగా పంటలు పోయినప్పుడు ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. వంశధార ఎడమ కాలువను బొడ్డపాడు వేపాడు చెరువు మీదుగా ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని, సాగు, తాగునీరు అందించాలని, ప్రస్తుత వ్యవసాయ సీజన్ లో చెరువులన్నిటిని మదుములు నుండి కాలువల వరకు ఆధునికరించి, తవ్వించాలని, రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించాలన్నారు. ఉద్దాన ప్రాంతంలో ప్రపంచంలోనే అత్యధిక కిడ్నీ బాధితులు పట్టి పీడిస్తున్న సమస్యని,

ఈ సమస్యపై మొక్కుబడి చర్యలు కాకుండా చిత్తశుద్ధితో వ్యాధి మూలాలను పరిశీలించి, బాధితులకు ఉచితంగా మందులు, ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్గో ఎయిర్ పోర్టు ఉద్దాన ప్రాంతంలో అవసరం లేదని, ఉద్దాన ప్రాంత ఆధారిత పరిశ్రమలు ప్రజల ఆమోదంతో నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మామిడి మాధవరావు, దాసరి శ్రీరాములు, నల్ల హడ్డి, తామాడ త్రిలోచన రావు, వంశధార సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మధ రావు, మద్దిల ధర్మారావు, బొడ్డు సింహాద్రి, కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక అధ్యక్షుడు కొమరం వాసు, పుచ్చ దుర్యోధన, బత్తిన వాసుదేవు, మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరావు, కుత్తుం హేమలయ్య, తామాడ రామారావు, రాపాక చిన్నారావు, కీలు తవిటయ్య, గున్నయ్య, ముకుందరావు, డొక్కరి వీరాస్వామి, హేమారావుచౌదరి, నారాయణస్వామి, మోహనరావు, కోరాడ లింగమూర్తి తదితరులు సభ్యులు పాల్గొన్నారు.



# కొంకడాపుట్టిలో .. భేటీ బచావో-భేటీ పడావో, కిశోరి వికాసం



**మందస, మే 21(వార్త):** ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పి.అరుణ ఆధ్వర్యంలో కొంకడపుట్టి గ్రామంలో కొంకడాపుట్టిలో భేటి బచావో-భేటి పడావో, కిశోరి వికాసం కార్యక్రమాలు జరిగాయి. మందస మండలంలోని కొంకడాపుట్టిలో ప్రధాన మంత్రి జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా భేటి బచావో-భేటి పడావో, కిశోరి వికాసం నిర్వహిం చినట్టు పీఓ అరుణ చెప్పారు. ఆడపిల్లల భద్రత, విద్య పట్ల సూచనలు చేశారు. అంగన్ వాడీ కేంద్రాల నుండి వస్తున్న పౌష్టికాహారం పట్ల లబ్ధిదారులకు వివరించి, అవగాహన కల్పించారు. ఐ.సి.డి.యస్ పరిధిలో ఉన్న కేంద్రాలకు కొత్త బిల్డింగ్ నిమిత్తం తీర్మానం, స్కెచ్ లు ఇవ్వమని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు, సెక్రటరీ, సచివాలయం సిబ్బంది, సూపర్ వైజర్ పి.జయలక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దాహార్తిని తీర్చడం అభినందనీయం

*** మునిసిపల్ కమిషనర్ హనుమంతు కూర్మరావు**

*** ఏడు రోడ్ల కూడలిలో గ్లూకోజ్, మంచి నీరు పంపిణీ**

**శ్రీకాకుళం, మే 21 (వార్త):** మండుతున్న ఎండల్లో ఓఆర్ఎస్, గ్లూకోజ్ వంటివి తీసుకోవడం ద్వారా బాటసారులు, వాహన చోదకులు ఉపశమనం పొందవచ్చని శ్రీకాకుళం మునిసిపల్ కమిషనర్ హనుమంతు కూర్మరావు పేర్కొన్నారు. కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక ఏడు రోడ్ల కూడలిలో ప్రజలకు తాగునీటి సీసాలు, గ్లూకోజ్ నీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ.. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్యంపై సామాజిక బాధ్యతతో కిమ్స్ యాజమాన్యం ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి నటుకుల మోహన్ మాట్లాడుతూ.. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు ఆరోగ్య సూత్రాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు కొబ్బరినీళ్లు, మజ్జిగ, బార్లీ, సబ్జా గింజల వంటి పానీయాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్, కిమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బంది, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు గౌతమి, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## అధికారులతో ఎమ్మెల్యే శిరీష సమీక్ష

**పలాస, మే 21 (వార్త):** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై అధికారులతో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం పలాస టిడిపి పార్టీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కుటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గస్థాయి లో మంజూరు కాపాడిన వివిధ స్థాయిలలో ఉన్న పనులు వాటి పరిస్థితి, త్రాగు నీటి పరిస్థితి వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్న తీరుపై పలు అంశాలు అన్నిటిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 60 శాతం పైబడి పనులు పూర్తికాబడ్డాయని, పూర్తయినటువంటి పనులన్నీ కూడా జూన్ మొదటి వారంలో ఒక ప్రత్యేక కార్యాచరణతో ఎక్కడెక్కడ ప్రారంభోత్సవాలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని, రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు సాధించిన విజయాలపై ఒక శ్వేత పత్రాన్ని కూడా విడుదల చేయడం జరుగుతుందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశాలన్నిటి పైన సమగ్రమైనటువంటి సమాచారంతో ప్రజల వద్దకు వెళ్లడానికి నిర్ణయించుకున్నామని చెప్పారు. ఆర్డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, ఐటిడిఏ, మున్సిపల్ శాఖ అధికారులతో సమీక్షించారు.





## వృద్ధాశ్రమంలో
# ధర్మాన జన్మదిన వేడుకలు

**సోంపేట. మే 21 (వార్త):** సోంపేట సమీపంలో గల సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు జన్మదిన వేడుకలు వైసీపీ నేతల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. పలువురు వృద్ధుల సమక్షంలో ఇచ్ఛాపురం వైసిపి సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, ఆసి కృష్ణారెడ్డి, ప్రకాష్ పట్నాయక్, సల్ల దేవరాజు, దక్కత నూకయ్య రెడ్డి, ఆశ పురుషోత్తం రెడ్డి తదితరులు వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి ధర్మాన ప్రసాదరావు జయంతిని నిర్వహించారు. ధర్మానకు భగవంతుడు మంచి ఆయురారోగ్యాలు ప్రసాదించి శ్రీకాకుళం జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించే శక్తిని ప్రసాదించాలని కోరారు. అనంతరం ఆశ్రమంలో వృద్ధులు వికలాంగులకు అనాధలకు భోజన సదుపాయాలు కల్పించారు.



# పలాస పౌరుడిగా ప్రశ్నిస్తా.. బెదిరేది లేదు

- ముప్వల నగేష్‌కు న్యాయం అడిగితే కేసులా?
- బెల్ట్ షాపులపై నిలదీస్తే బెదిరింపులా?
- పలాస జిల్లా, మద్యం సిండికేట్, పీఏసీఎస్‌పై ఎమ్మెల్యేకు దువ్వాడ శ్రీధర్ (బాబా) అల్టిమేటం
- 'సోంపేట నుంచి వచ్చి పలాసలో దౌర్జన్యమా.. 2029లో తేలుస్తాం'
- నారా లోకేష్ ఇచ్చిన మాట ఎమ్మెల్యే గుర్తు చేయలేదా?
- బాటిల్‌పై రూ.20 అదనం.. మద్యం సిండికేట్‌లో వాటాలా?
- పీఏసీఎస్‌కు సెంటు భూమి ఇచ్చారా.. రూ.15 కోట్ల భవనం కనిపించలేదా?
- శ్రమజీవుల కష్టాన్ని లూటీ చేస్తారా.. ఆడబిడ్డల ఉసురు పోసుకుంటారా?
- ప్రజా సమస్యలు అడిగితే కేసులు.. ఇదేనా ప్రజాస్వామ్యం?



**పలాస, మే 21 (వార్త):** పలాస నియోజకవర్గంలో ఎన్నికల హామీల అమలు, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బెదిరింపులకు దిగుతున్నారని ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, పలాస పీఏసీఎస్ పూర్వ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ (బాబా) మండిపడ్డారు. గురువారం పలాసలోని తన నివాసంలో మృతుడు ముప్వల నగేష్ తల్లి ముప్వల సుందరమ్మ, నువ్వలరేవు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ముప్వల నగేష్ ఘటన, పలాస జిల్లా, బెల్ట్ షాపులు, పీఏసీఎస్, భూకబ్జాల అంశాలపై ఎమ్మెల్యేను సూటిగా నిలదీశారు. "100 రోజుల్లో ముప్వల నగేష్ ఘటనపై న్యాయ విచారణ చేపడతామని 'యువగళం' కార్యక్రమంలో పలాసకు వచ్చిన నారా లోకేష్ బహిరంగంగా హామీ ఇచ్చారు. ఆ వేదికపై ఎమ్మెల్యే గౌతు శిరీష కూడా ఉన్నారు. రెండేళ్లు గడిచినా ఎమ్మెల్యే స్పందించలేదని అన్నారు. న్యాయం చేస్తామని నువ్వలరేవు గ్రామానికి వెళ్లి జనసేన నేతల ప్రోద్బలంతో 4000 ఓట్లు వేయించుకున్నారని, గెలిచాక ఆ తల్లి కన్నీళ్లు తుడవడం మరిచారని మండిపడ్డారు. చనిపోయి ఐదేళ్లయినా ఆ కుటుంబానికి న్యాయం చేయకుండా కాలక్షేపం చేయడం సమంజసమేనా? ఈ హామీని లోకేష్ దృష్టికి తీసుకెళ్లే తీరిక కూడా ఎమ్మెల్యేకు లేదా?" అని దువ్వాడ నిప్పులు చెరిగారు. ముప్వల సుందరమ్మ మాట్లాడుతూ "నా కొడుకును పొట్టనబెట్టుకున్నారు. న్యాయం అడిగితే ఎవరూ పట్టించుకోవడం లేదు" అని కన్నీటిపర్యంతమయ్యారు. పలాస జిల్లా సాధన కోసం నియోజకవర్గంలో విద్యార్థి సంఘాలు, మేధావులు, జేఏసీ నేతలు, వ్యాపారస్తులు పోరాటం చేస్తుంటే ఎమ్మెల్యే మౌనం వహించడం దారుణమన్నారు. "రాష్ట్ర ప్రభుత్వం పలాస జిల్లా విషయంలో ప్రతిపాదన చేసిన తర్వాత, వైభవ్ ప్రారంభోత్సవ కార్యక్రమం వద్ద పలాస జిల్లా రావడం ఖాయమని ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు ఆమె భర్త కూడా మైక్‌లో ప్రకటించారని అన్నారు. తర్వాత ఆ వీడియోలు సోషల్ మీడియా నుంచి ఎందుకు మాయం చేశారు? జిల్లా విషయంలో మాట తప్పి ప్రజల ఆకాంక్షను తుంగలో తొక్కి మోసం చేస్తారా? ఉద్యమానికి మద్దతివ్వకుండా నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు" అని ధ్వజమెత్తారు. మద్యం అంశంపై మాట్లాడుతూ "పలాస నియోజకవర్గంలో ఎంఆర్‌పీ కంటే ప్రతి వైన్ షాపులో బాటిల్‌పై రూ.20, గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో రూ.50 అదనంగా దోచేస్తున్నారు. కాశీబుగ్గ, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. శ్రమజీవుల రోజువారీ కూలీ రూ.500 అయితే, అందులో రూ.200 సారాయికే పోతోందని, వారి చెమటను సారాయిగా మార్చి తాగేస్తున్నారు. బెల్ట్ షాపులతో ఆడబిడ్డల తాళిబొట్లు తెగుతున్నాయని, పిల్లల చదువులు ఆగిపోతున్నాయని అన్నారు. ఒక్క సంతకంతో ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చి బెల్ట్ షాపులు ఆపే అధికారం ఎమ్మెల్యేకు ఉందని, కానీ మద్యం సిండికేట్‌లో ఎమ్మెల్యే, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయి కాబట్టి ఆపడం లేదని ధ్వజమెత్తారు. ఆ వాటాలు ఎమ్మెల్యే కోటరీకి, అనుచరులకు నెలనెలా వెళ్తున్నాయి" అని తీవ్ర ఆరోపణలు చేశారు. పీఏసీఎస్‌పై స్పందిస్తూ "నేను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పలాస పట్టణంలో భూమి సేకరించాను. అప్పుడు ఎమ్మెల్యేగా గౌతు శివాజీ ఉండి కూడా భవన నిర్మాణాన్ని అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో రూ.15 కోట్లతో అన్ని హంగులతో అద్భుత భవనం కట్టామని తెలిపారు. రైతులకు గోదాములు, బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, పీఏసీఎస్‌కు మీ నాన్న గౌతు శివాజీ గానీ, నువ్వు గానీ సెంటు భూమి ఇప్పించారా?, ఒక్క ఇటుక ఇచ్చిన దాఖలాలు చూపించండి" అని సవాల్ విసిరారు. ఒకప్పుడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా దళిత నేత సిర్ల రవిచంద్ర (బుజ్జి) సన్న, చిన్నకారు రైతులకు రుణ పరపతి కల్పించారని, త్రీ మెన్ కమిటీ సభ్యులు చింతాడ మాధవరావు, పైల వెంకట్రావు (చిట్టి) సొసైటీ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. "పలాస పౌరుడిగా, ఈ గడ్డపై పుట్టిన వాడిగా ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరిస్తారా? బెదిరిపోయే బేవకూఫ్‌ని కాదు.. ఈ దువ్వాడ శ్రీధర్ ఇక్కడ లోకల్. నేను, నా తండ్రి దువ్వాడ కృష్ణమూర్తి పలాసలోనే పుట్టాం. మా తాతల కాలం నుంచి ఇక్కడే ఉన్నాం. సోంపేట నుంచి వచ్చి మాపై దౌర్జన్యం చేస్తే పలాస ప్రజలు ఊరుకోరు. 2019లో మీరు చేసిన తప్పులకు ప్రజలు వెంటబెట్టారు. మళ్లీ అదే తప్పులు చేస్తే 2029లో మీ సంగతి ఏమిటో పలాస ప్రజలే తేలుస్తారు. తప్పు చేయలేదు కాబట్టి భయపడేది లేదు" అని హెచ్చరించారు.

"కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రెండేళ్లలో పలాసలో ఎంత దోచుకున్నారో ప్రజలకు తెలుసని, ముప్వల నగేష్‌కు న్యాయం, పలాస జిల్లా సాధన, అధిక ధరల మద్యం విక్రయాలు, బెల్ట్ షాపుల నిరోధం, చెరువుల ఆక్రమణలు, భూకబ్జాలపై నా పోరాటం ఆగదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ముందు నెరవేర్చండి ఎమ్మెల్యే గౌతు శిరీష. లేకపోతే రాజకీయ భవిష్యత్తు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని హెచ్చరించారు . అనవసరంగా జోలికి వస్తే స్థానికేతురాలికి పలాస ప్రజలు గుణపాఠం చెప్పక తప్పదు" అని దువ్వాడ శ్రీధర్ (బాబా) అల్టిమేటం జారీ చేశారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు కే హేమాచలం, సుందరమ్మ, ముప్వలు వేణు, నువ్వల రేవు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జన్ భాగిదారి - "సబ్సే దూర్.. సబ్సే పహలే" విజయవంతం

**పలాస, మే 21 (వార్త):** పలాస మండలంలోని లోత్తూరు గ్రామంలో గురువారం "జన్ భాగిదారి – –సబ్సే దూర్... సబ్సే పహలే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో వసంత్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. జన్ భాగీదారి అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న "సబ్సే దూర్... సబ్సే పహలే" కార్యక్రమం గిరిజన, దూర గ్రామాల్లో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా చేయడం, ప్రజల్లో అవగాహన పెంచడం, స్థానిక భాగస్వామ్యాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమ లక్ష్యాలుమని, గ్రామస్థాయిలో జరుగుతున్న ఈ ప్రయత్నాలు పథకాల చేరువను పెంచుతూ, సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తున్నాయని తెలిపారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరవేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, నిరుపేద కుటుంబాలకు అందుతున్న పథకాల వివరాలను క్లుప్తంగా వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు చైతన్యం కల్పించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎంపీడీఓ గారు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడినందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, యువత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థుల అభ్యున్నతికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం

- 10వ తరగతి ఉత్తీర్ణ విద్యార్థులకు అభినందన సభ
- ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా బహుమతుల ప్రదానం



**పలాస, మే 21 (వార్త):** విద్యార్థుల అభ్యున్నతికి తల్లిదండ్రులు పాత్ర ఎంతో కీలకమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గలో గల "పి.ఎమ్. శ్రీ" పథకం ఆధ్వర్యంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గురువారం అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష విద్యార్థుల భవిష్యత్తు, విద్యలో క్రమశిక్షణ ప్రాముఖ్యతతో పాటు పిల్లల ఉన్నతికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. మొత్తం 250 మందికి గాను 200 పైగా ఉత్తీర్ణత సాధించుగా అందులో 580 పైగా మార్కులు సాధించిన వారు 9 మంది 570 పైగా మార్కులు సాధించిన వారు ఏడు మంది 500 పైగా మార్కులు సాధించిన వారు 42 మందిని చెప్పారు. పాఠశాలలో అత్యధికంగా 591 మార్కులు సాధించిన విద్యార్థిని పూజారి కీర్తిని ప్రత్యేకంగా అభినందించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరికీ ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రచార రథం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించి వారి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలాస పట్టణ ముఖ్య నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలు చట్ట విరుద్ధం

- తహసీల్దార్, ఎస్ఐకు వినతి
- మెడికల్ దుకాణాల యజమానులు నిరసన ర్యాలీ

**మందస, మే 21(వార్త):** ఆన్ లైన్ లో నియంత్రణ లేకుండా జరుగుతున్న ఔషధ విక్రయాలు నిషేధించాలని మెడికల్ షాపుల యజమానులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారంతా నిరసన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ డిస్కౌంట్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మెడికల్ దుకాణాలతోపాటు ఫార్మసిస్టులు బంద్ పాటించడం జరిగిందన్నారు. ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్ పిలుపు మేరకు మందస మండలంలోని యజమానులు, డ్రగ్గిస్టులు, కెమిస్ట్ లు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశామన్నారు. హరిపురం-బాలిగాం జంక్షన్ నుండి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈసీ మెంబర్ బి.జోగారావు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఆన్ లైన్ మందుల విక్రయాలు చట్ట విరుద్ధమని, అక్రమమని పేర్కొన్నారు. ప్రభుత్వం గతంలో జారీచేసిన జి.ఎస్.ఆర్ 817 నోటిఫికేషను ఉల్లంఘిస్తూ ప్రస్తుత ఆన్లైన్ అమ్మకాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఆన్లైన్ ఫార్మసిస్టులకు సంబంధించిన జారీ చేసిన జి.ఎస్.ఆర్ 817 నోటిఫికేషన్ ను తక్షణమే రద్దు చేయాలని, మందుల విక్రయాలకు కొత్త మార్గదర్శకాలు రూపొందించాలని, కరోనా మహమ్మారి సమయంలో తీసుకువచ్చిన జిఎస్సార్ 220 నోటిఫికేషన్ ను ఉపసంహరించుకోవాలన్నారు. ఆన్లైన్ ప్లాట్ ఫామ్ లో ఇస్తూ, భారీ డిస్కౌంట్ లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలపై మందస తాసిల్దార్ మిస్కా శ్రీకాంత్ కు మందస ఎస్సై కే కృష్ణ ప్రసాద్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డ్రగ్గిస్ట్, కెమిస్టు మందుల షాపు యజమానులు రౌతు చిరంజీవరావు, వాయలపల్లి ఆనందరావు, గేదెల శ్యామ్, బైరిశెట్టి రాజేశ్వరి, గడ్డవలస రంజిత్, పసుపురెడ్డి ఉదయ్, కె.శ్రీధర్, ఎస్.కిషోర్, ఎం.శంకర్, ఆర్.లక్ష్మణ్ కుమార్, ధనుంజయ, కామేశ్వరరావు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



**మెళియాపుట్టి, మే 21(వార్త):** ఖరీఫ్ 2026 సమీపిస్తున్న తరుణములో చేపర రైతు సేవ కేంద్రం లో రైతులకు 50 శాతం రాయితీపైన పచ్చిరొట్ట విత్తనాలతో పాటు కట్టే, జనుము, జీలుగ పంపిణీ చేయడం జరిగిందని వ్యవసాయధికారి ఎస్. దానకర్ణుడు తెలిపారు. మండలంలో గల చాపర రైతు సేవా కేంద్రంలో గురువారం నాడు మండల వ్యవసాయధికారి అధ్యక్షతన, కోసమాల పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, మండల పార్టీ అధ్యక్షులు వెంకట్రావుల నేతృత్వంలో రైతులకు వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయధికారి దారుణకర్ణుడు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడం వలన నేలలో సేంద్రియ కర్బన శాతం పెంచడంతో పాటుగా రసాయన ఎరువుల వినియోగాన్ని కూడా తగ్గించుకోవచ్చని, ముఖ్యంగా పంట దిగుబడులు అధికంగా పొందవచ్చునని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తున్న పిఎండిఎస్ విత్తనాలను ఈ ఏడాది వాతావరణం దృష్ట్యా ప్రతి ఒక్క రైతు కూడా కచ్చితంగా సాగు చేయాలన్నారు. పి ఎం డి ఎస్ విత్తన కిట్టులో కట్టే జనుము, జీలుగుతోపాటు అపరాలు తృణధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయ విత్తనాలు ఉండడం వలన నేల పొరల్లో వేర్లు విస్తరించి సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందడంతో పాటు నేలలో అనేక పోషకాలను మొక్కలకు అందించే అవకాశం ఉండి రైతులకు ఆర్థికంగా లాభము చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, నంబాల వెంకట్రావు, భాస్కర్ గౌడ్, శ్రీను, పోలునాయుడు, నాగభూషణరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హైబ్రిడ్ పద్ధతిలో మహానాడు

**పలాస, మే 21 (వార్త):** అనేక సంక్షోభాల నడుమ నెల్లూరు జిల్లాలో నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహిస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు.

పశ్చిమ ఆసియా యుద్ధం కారణంగా దేశంలో ఆర్థిక సంక్షోభంతో పాటు ఇందన సంక్షోభం వంటి అనేక కారణాలతో నెల్లూరు జిల్లాలో తలపెట్టిన మహానాడు కార్యక్రమాన్ని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించడానికి రాష్ట్ర పార్టీ నిర్ణయం తీసుకున్నందున దానికి అనుగుణంగా నియోజకవర్గస్థాయిలో ఈ నెల 27,28 తేదీల్లో క్లస్టర్ వారీగా ప్రతినిధుల సభలో పాల్గొని మహానాడు ను విజయవంతం చేయడానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయడానికి గురువారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అధ్యక్షతన అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, కోకన్వీనర్లు, ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546